నమస్తే తెలంగాణ
కామారెడ్డి
12 | నిజామాబాద్, మంగళవారం 4 మార్చి 2025 | KAMAREDDY

రంజాన్ వేళలు
మంగళవారం
ఇఫ్తార్: 6-32
బుధవారం
సహర్: 5-22

కార్యాలయం వెలుపల పోలీసుల బందోబస్తు

అవినీతి, అక్రమాలకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. బోగస్ పత్రాలు సృష్టించి, నకిలీ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయడంలో ఆరి తేరింది. ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా డాక్యుమెంట్లు సృష్టించి, స్థిరాస్తిపై హక్కులు ప్రసాదించడం ఈ శాఖకే చెల్లింది. కొందరు అధికారులు చట్టప్రకారం నిబంధనలకు అనుగుణంగా చేయాల్సిన పనులను అడ్డదారుల్లో చేస్తూ రిజిస్ట్రేషన్ శాఖకు చెడ్డపేరు తెస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న కొందరు సబ్‌రిజిస్ట్రార్లు పైసాయే పరమావధిగా పనిచేస్తూ కాసుల వేటలో మునిగితేలుతున్నారు. ఈ అక్రమార్జన తంతులో డాక్యుమెంట్ రైటర్లు కీలక పాత్ర పోషిస్తుండడం గమనార్హం.

-నిజామాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

అవినీతికి అడ్డా అక్రమాల పుట్ట!

రిజిస్ట్రేషన్ శాఖలో లంచాల పర్వం

అక్రమార్కులకు సహాయ, సహకారాలు
నకిలీ డాక్యుమెంట్లు, బోగస్ రిజిస్ట్రేషన్ల వేటు పడుతున్నా
తీరుమార్చుకోని అధికారులు
వంతపాడుతున్న పలు రాజకీయ పార్టీల నేతలు
అవినీతి తంతులో క్రియాశీలకంగా మారిన డాక్యుమెంట్ రైటర్లు

అక్రమార్కులకు అధికారుల సహకారం

భూ వ్యవహారాల్లో స్థానిక పోలీసుల సహాయ, సహకారాలను అక్రమార్కులు దక్కించుకుంటున్నారు. నకిలీ పత్రాలతో హడావుడి చేసే వ్యక్తులను ఎవరైనా ప్రశ్నిస్తే వారి నోరు మూయించేందుకు ఖాకీలు తెర మీదకు వస్తున్నారు. కాసుల ఆశ చూపడంతో పోలీసులు సైతం మౌనంగా ఉంటూ, సహకారం అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. సబ్ రిజిస్ట్రార్లు చేస్తున్న అక్రమాల్లో రెవెన్యూ, పోలీస్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు ఉద్యోగుల ప్రత్యక్ష పాత్ర ఉంటున్నది. వీరంతా కలిసి నిజామాబాద్ శివారులో భారీ గూడు పుఠానిని నడుపుతున్నారు. భూ దందాలో ఆరితేరి పోవడంతో ఈ ముఠాకు సామాన్యులు భయపడాల్సి వస్తున్నది.

మాజీ ప్రతినిధినీ వదలని ముఠా

బాల్కొండ నియోజకవర్గంలో గతేడాది ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన భూమిని కూడా ఈ ముఠా వదల్లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. శ్రమకోర్చి కొనుగోలు చేసిన భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయడంతో సదరు నేత లబోదిబోమన్నాడు. చివరికి ఓ నాయకుడి సాయంతో ఊపిరి పీల్చుకోవాల్సి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించి సామాన్యులకు అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమార్కులతో అంటకాగుతున్న వారిలో అధికార పార్టీ నాయకులు కూడా ఉండడం విస్మయానికి గురిచేస్తున్నది.


ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్,స్వీపర్

కీలకంగా మారిన డాక్యుమెంట్ రైటర్లు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లకు, వారి కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది, అటెండర్లకు ఎలాంటి అడ్డంకులూ ఉండవు. ప్రవేశం లేని చోట ఇట్టే దూసుకు పోతారు. కీలకమైన పత్రాలను స్కాన్ చేసి, పేరు మార్పిడి చేసే కార్యాలయ ఆవరణలోకి స్టాంపు లు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన ఉద్యోగులు మినహా వేరే వారికి అనుమతి ఉండదు. ఒకవేల ప్రవేశిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. కానీ నిజామాబాద్ అర్బన్, నిజామాబా ద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, దోమకొండ, కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారిదే హవా. సబ్ రిజిస్ట్రార్ టేబుళ్లపై స్వేచ్ఛగా నిలబడేంత హక్కు వారికే ఉందంటే అతిశయోక్తి కాదు. ఒక్క సంతకం మినహా మిగిలిన వ్యవహారాల్లో వీరే కీలక పాత్ర పోషిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్ల సహాయం లేకుండా ఒక్క డాక్యుమెంట్ కూడా రిజిస్ట్రేషన్ కాదంటే నమ్మశక్యం కాదు. నేరుగా సామాన్యుడే స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్న దాఖలాలు చాలా అరుదు. మధ్యవర్తులుగా వ్యవహరించే డాక్యుమెంట్ రైటర్లు ఎంత చెబితే అంతా. వారు ఏ డాక్యుమెంట్ ఇస్తే అదే సర్వం. అందులో ఏముంది. ఎలాంటి అంశాలు పొందుపర్చారు. అమ్మేవారు, కొనేవారు నిజమేనా? అన్న వాస్తవాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చెక్ చేసుకోవడం అన్నది దొల్లగా మారింది. రెడ్‌హ్యాండెడ్‌గా రూ.10వేలు లం చం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు సబ్ రిజిస్ట్రార్ పట్టుబడడంతో ఇప్పుడు మరోసారి రిజిస్ట్రేషన్ శాఖ అవినీతి తంతుపై తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తుండడం గమనార్హం.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకునే అక్రమార్కులకే రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో పనులు సులువుగా పూర్తవుతున్నాయి. అసలైన పత్రాలతో వెళ్లే వారిని చెప్పులరిగేలా తిప్పించడం ఇక్కడ పరిపాటిగా మారింది. అడిగినన్నీ డబ్బులు ఇవ్వాలి, లేకుంటే కొర్రీలు పెట్టి వాయిదాలు వేయడం కూడా సబ్ రిజిస్ట్రార్లకు వెన్నతోపెట్టిన విద్య. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, అక్రమాలకు పాల్పడుతున్న వారికి సబ్ రిజిస్ట్రార్లు సహకరిస్తూ శాఖ పరువును బజారుకీడుస్తున్నారు. గతేడాది కాంగ్రెస్ పార్టీకి చెందిన భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలోనూ అక్రమార్కులకు వంతపాడిన విషయమే ఇందుకు ఉదాహరణ. ఇలాంటి అక్రమాల్లో డాక్యుమెంట్ రైటర్లు కూడా కీలక భూమిక పోషిస్తున్నారు.

'బైపాస్ భూముల'తో కాసుల వర్షం

నిజామాబాద్ అర్బన్, రూరల్ సబ్ రిజిస్ట్రార్లకు బైపాస్ రోడ్డులోని భూములు కాసుల వర్షం కురిస్తున్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల మధ్య మిగులు భూమిని కబ్జాచేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆధీనంలోని అసైన్డ్ భూములకు నాలా కన్వర్షన్ సులువు కావడంతో వాటికి కూడా ఎడాపెడా రిజిస్ట్రేషన్లు చేస్తూ భారీ మొత్తంలో దండుకుంటున్నారు. వక్రమార్గంలో నడిచే రిజిస్ట్రార్లను మచ్చిక చేసుకుని రియల్ వ్యాపారులు రూ.కోట్లు విలువ చేసే భూములకు బోగస్ పత్రాలు సృష్టించి, నకిలీ వ్యక్తుల పేరిట పేరు మార్పిడి చేయించుకుంటున్నారు. లేని నకిలీ రికార్డులను రూపొందించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నెలల వ్యవధిలోనే చేతులు మారినట్లుగా చూపించి అక్రమిత భూములను సక్రమం దిశగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ భూముల వ్యవహారంలో అధికార పార్టీలోని కీలక నేతల పాత్ర కూడా ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఓ ఉద్యోగ సంఘానికి చెందిన కీలక నేత అండదండలతో ముఖ్యమైన భూముల సర్వే నంబర్లు, వాటి స్వరూపానికి సంబంధించిన సమాచారాన్ని తెప్పించుకుని, స్పష్టతలేని డాక్యుమెంట్లు ఉన్న స్థలాలను కొన్ని ముఠాలు అప్పనంగా కాజేస్తున్నాయి. ఇందులో ఎక్కువగా బైపాస్ రోడ్డు చుట్టుపక్క భూములే ఉండడం గమనార్హం. డబుల్ రిజిస్ట్రేషన్లతో అక్రమార్కులు చేస్తున్న దందాలో సామాన్యులు ఇరుక్కొని విలవిలలాడుతున్నారు.

రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఏసీబీ దాడుల కలకలం

లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్-2

- **స్వీపర్ ద్వారా రూ.10వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు**
- **ఇద్దరిపై కేసు నమోదు.. నాంపల్లి కోర్టుకు తరలింపు**
- **సబ్‌రిజిస్ట్రార్ స్వస్థలం నిర్మల్‌లోని ఇంట్లో సోదాలు**

వినాయక్‌నగర్, మార్చి 3: నిజామాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడి కలకలం సృష్టించింది. జిల్లా కేంద్రంలోని కవిత కాంప్లెక్స్‌లో ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం దాడులు చేయడంతో అక్కడున్నవారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యారు. సబ్ రిజిస్ట్రారు -2 గా విధులు నిర్వహిస్తున్న శ్రీరామరాజు రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీ బీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. శ్రీరామరాజు తన వద్దకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఫైల్స్ ముందుకు కదలాలంటే ఆయన డిమాండ్ చేసినంత ముట్టజెప్పాల్సిందేననే ప్రచా రం ఉంది. ఈ క్రమంలో నిజామాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి తన ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం కొన్నిరోజుల క్రితం కార్యాలయానికి వెళ్లగా.. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ జరగాలంటే తనకు రూ. 10 వేలు లంచం ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు డిమాండ్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బాధితుడు రూ.10 వేలు లంచం ఇచ్చేందుకు సోమవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. లంచం డబ్బులను కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేసే ఆర్.వెంకట్‌రావుకు ఇవ్వాలని రిజిస్ట్రార్ సూచించగా.. బాధితుడు స్వీపర్‌కు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ సిబ్బందితో కలిసి దాడిచేశారు. లంచం డబ్బులతో సబ్ రిజిస్ట్రార్-2 శ్రీరామరాజుతోపాటు స్వీపర్ వెంకట్‌రావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి వారిని నాంపల్లి ఏసీబీ స్పెషల్ కోర్టుకు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ వెల్లడించారు.

సబ్‌రిజిస్ట్రార్ ఇంటిపై సైతం దాడి

సబ్ రిజిస్ట్రారు -2 శ్రీరామరాజు ఇంటిపై కూడా దాడి చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఆయన ఇంటిపై మధ్యాహ్నం దాడి నిర్వహించిన అధికారులు, రాత్రి వరకు సోదాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

అందని నీళ్లు.. ఆగని కన్నీళ్లు

కొల్లూర్ శివారులో కాలువ నీరు అందక పగుళ్లు తేలిన పొలం

- **చివరి ఆయకట్టుకు అందని నిజాంసాగర్ జలాలు**
- **పొట్ట దశలోనే ఎండుతున్న పంటలు**
- **పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో రైతులు**

కోటగిరి, మార్చి 3: యాసంగి సాగు కష్టతరంగా మారింది. నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు కింద సాగవుతున్న వరి పంటకు నీళ్లు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉండడం, సాగునీటికి ఢోకా ఉండదని భావించిన పాతంగల్ మండలం కొల్లూర్ శివారులో రైతులు వరి పంటలను సాగు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో చివరి ఆయకట్టు పంటలకు నిజాంసాగర్ కాలువ నీరు అందకపోవడంతో పొట్ట దశలో ఉన్న వరి పంట ఎండిపోతున్నది. కళ్లెదుటే ఎండిపోతున్న పంటను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. సాగునీరు అందించాలని కొల్లూర్ రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొల్లూర్ శివారులో బర్ల గంగారాం, బర్ల నాగేశ్ అనే రైతులు వరి పంటను సాగు చేశారు. కానీ నిజాంసాగర్ కాలువ నీరు విడుదల చేసి పది రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకు వరి పంటకు ఒక చుక్క నీరు కూడా అందలేదని వాపోయారు. వరి పంట పొట్ట దశలో ఉన్నదని, మందులు చల్లుదామంటే కూడా చుక్క నీరు లేదంటున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరి పంటలకు నీరు అందించి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

కాలువ నీరు అందక పొలం ఎండిపోయేలా ఉన్నది..

నాకు ఉన్న ఐదెకరాల్లో వరి పంటను సాగు చేసిన. నిజాంసాగర్ కాలువ నీరు అందక పొలంలో పగ్రెలు వచ్చినయ్. కలుపు కూడా తీయడానికి వస్తలేదు. కూలీలు కొడవలితో కలుపు మొక్కలను కోస్తున్నారు. పొలంలో చుక్క నీరు లేక మందులు కూడా చల్లలేదు. నిజాంసాగర్ కాలువపై భాగంగా ఉన్నవారు కిందకి రాకుండా అడ్డు వేసి మా పొలాలకు నీరు రాకుండా చేస్తున్నరు. పొలం నుంచి కాలువ వరకు రూ. 25 వేలు ఖర్చు పెట్టి పైపులు వేసినా, నీరు అందడం లేదు. పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు అందకుంటే ఎండిపోయేటట్టు ఉన్నది. అప్పులు ఎలా తీర్చాలి..?మా గోడు ఎవరికీ పట్టదా.?

- బర్ల గంగారాం, రైతు, కొల్లూర్, పాతంగల్ మండలం

రైతుల గోస పట్టదా?

కొల్లూర్ శివారులో రెండున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. కానీ పంటకు ఇప్పటి వరకు చుక్క నీరు కూడా అందలేదు. వరి పొట్ట దశలో ఉన్నది. నీరు అందడం లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా మా గోస ఎవరికీ పట్టడం లేదు. నిజాంసాగర్ కాలువ నీరు వదిలి 10 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు చివరి ఆయకట్టు వరకు అందడం లేదు. మా పంటలకు నీరు అంద కుండా కాలువ మూసేశారు.

- బర్ల నాగేశ్, రైతు, కొల్లూర్, పాతంగల్ మండలం

సారూ.. నా కొడుకులు పట్టించుకోవడం లేదు..

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఓ వృద్ధురాలి ఫిర్యాదు

నవీపేట, మార్చి 3: వృద్ధాప్యంలో తనను కొడుకులు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధురాలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఫిర్యాదు చేసింది. నవీపేట మండలంలోని కోస్లీ పరిధిలోని ఫకీరాబాద్ గ్రామానికి చెందిన గుడ్డి ముత్యమ్మ భర్త గతంలో మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కొడుకు గతంలో మృతి చెందాడు. ప్రస్తుతం శ్రీను, రమేశ్ కుమారులు తన తల్లిని వృద్ధాప్యంలో పట్టించుకోకపోవడంతో ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ కాలం వెల్లదీస్తున్నది. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు మొర పెట్టుకుంది.

బండరామేశ్వర్‌పల్లిలో ఇసుక వేలం

మాచారెడ్డి, మార్చి 3 : ఉమ్మడి మాచారెడ్డి మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నది. ఇసుక అక్రమ రవాణాపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'వాగులనూ తోడేస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇసుక దందాపై ప్రత్యేక దృష్టిసారించారు. బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం సీజ్ చేసిన 20 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు సోమవారం వేలం నిర్వహించారు.రూ.47 వేలకు గ్రామానికి చెందిన సందీప్ దక్కించుకున్నట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించినా, డంపులు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇసుక వేలం నిర్వహిస్తున్న అధికారులు

గల్ఫ్‌లో ఆటో డ్రైవర్ దుర్మరణం

'ఉచిత బస్సు'తో తగ్గిన గిరాకీ
ఉపాధి కోసం దుబాయికి..
రోడ్డు ప్రమాదంలో మృతి
స్వగ్రామంలో అంత్యక్రియలు

మోహన్ (ఫైల్)

మాక్లూర్(నందిపేట్), మార్చి 3 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత బస్సు పథకం.. ఆటో డ్రైవర్ల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపింది. గిరాకీ తగ్గడంతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులతోపాటు అప్పులపాలయ్యారు. ఆలూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన చలిగంటి మోహన్ (37) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ తగ్గింది. దీంతో మోహన్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. చేసిన అప్పులు తీర్చడానికి ఐదు నెలల క్రితం దుబాయి వెళ్లి అక్కడ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 23న జరిగిన కారు ప్రమాదంలో మోహన్ మృతి చెందాడు. మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకోగా.. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. మోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు గుమ్ముల నరేంద్ర, మోహన్, ఆటో యూనియన్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

పింఛన్ కోసం వృద్ధులకు ఇబ్బందులు తప్పడంలేదు. పాతంగల్ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద సోమవారం వృద్ధులు పింఛన్ కోసం మండుటెండలో బారులు తీరారు. తపాల కార్యాలయం వద్ద నిలువ నీడ కూడా లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. గ్రామ చావిడి వద్ద విశాలంగా ఉన్న తపాలా కార్యాలయాన్ని ఎంపీడీవో ఆఫీస్ కోసం ఖాళీ చేయడంతో పోస్టాఫీస్‌ను ఓ గల్లీలోని అద్దె గదిలోకి మార్చారు. ఇరుకైన గదిలో తపాలా కార్యాలయ సేవలు కొనసాగిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఖాతాదారులు, పింఛన్‌దారులు వాపోతున్నారు.

-పాతంగల్, మార్చి 3

నిజామాబాద్ మార్కెట్‌కు పోటెత్తిన 'పసుపు'

నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పచ్చబంగారం పోటెత్తింది. శివరాత్రి సందర్భంగా వరుస సెలవుల అనంతరం సోమవారం మార్కెట్ ప్రారంభంకావడంతో రైతులు భారీ మొత్తంలో పసుపును మార్కెట్ యార్డుకు తీసుకువచ్చారు. దాదాపు 55వేల బస్తాల పసుపు వచ్చినట్లు మార్కెట్ కమిటీ అధికారుల సమాచారం. ఎక్కువ మొత్తంలో పసుపు రావడంతో వాహనాలు గేటు బయట బారులు తీరాయి.

-కంఠేశ్వర్, మార్చి 3